సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

సోమవారం । 3 । ఏప్రిల్ । 2023



నిత్యాన్నదానానికి రూ.లక్ష


బిక్కవోలు: స్థానిక శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు అక్కల నాగసాయి, యశస్విని మాణిక్య, శ్రీయాన్ష సాయి వెంకట్ (రాజమహేంద్రవరం) ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



రూ.1,11,116 విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి నల్లమోతుల మోహన్‌రావు, ప్రభావతి దంపతులు (రాజమహేంద్రవరం) ఆదివారం రూ.1,11,116 విరాళం సమర్పించారు.

డెల్టాలకు 6,250 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 6,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,850, మధ్య డెల్టాకు 1,200, పశ్చిమ డెల్టాకు 3,200 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 7.65 అడుగులుగా ఉంది.



న్యూస్‌రీల్

విఘ్నేశ్వరా భజేహం



అయినవిల్లిలో లక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తున్న పండితులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. స్వామివారికి ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి విశేష పూజలు చేశారు. లఘున్యాస అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పలువురు నూతన వాహనాలకు పూజలు చేయించుకున్నారు. స్వామివారి ప్రత్యేక దర్శనం ద్వారా రూ.16 వేలు, అన్న ప్రసాదాలకు విరాళాలుగా రూ.78 వేలు, వివిధ సేవలకు రూ.14 వేలు, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.29 వేలు, వివిధ విరాళాలుగా రూ.12 వేలు వచ్చాయని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు వివరించారు.

అన్నదాన పథకానికి విరాళాల వెల్లువ



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి భక్తుల నుంచి విరివిగా విరాళాలు వచ్చాయని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు. తణుకు మండలం మందపాకకు చెందిన వై.మణికిశోర్, హేమశ్రీదేవి రూ.25,116, అమలాపురం మండలం భట్నవిల్లికి చెందిన ఎం.సత్యవెంకట సుబ్బరాయశాస్త్రి రూ.16,101, కృష్ణా జిల్లా బేతవోలుకు చెందిన పి.ఫణికుమార్ రూ.10,116, భీమవరానికి చెందిన ఎం.మోహన్, తేజస్వి రూ.10,116, టి.కాశీవిశ్వేశ్వరరావు రూ.10,020, కాజులూరు మండలం గొల్లపాలేనికి చెందిన వై.సత్తిబాబు, శ్రీలక్ష్మి రూ.10,116, రావులపాలెం మండలం గోపాలపురానికి చెందిన ఎం.సుబ్బారావు రూ.10,116 విరాళాలు సమర్పించినట్లు ఈఓ వివరించారు. దాతలకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

సత్యదేవునికి ఘనంగా జన్మ నక్షత్ర పూజలు



సత్యదేవుని దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

అన్నవరం: సత్యదేవుని జన్మ నక్షత్రం మఖ సందర్భంగా రత్నగిరిపై ఆదివారం విశేషార్చనలు నిర్వహించారు. తెల్లవారుజామున ఒంటి గంటకు ఆలయం తెరిచారు. సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి, శంకరుల మూలవిరాట్‌లకు పంచామృతాలు, పండ్ల రసాలతో మహాన్యాస పూర్వక అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేసి భక్తులను దర్శనానికి అనుమతించారు. దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ స్వామివారికి పూజలు చేశారు. 19 జంటలు రూ.3 వేల టికెట్ కొనుగోలు చేసి, స్వామివారి జన్మ నక్షత్ర అభిషేకాన్ని తిలకించినట్టు ఏఈఓ డీవీఎస్ కృష్ణారావు తెలిపారు. జన్మ నక్షత్రం సందర్భంగా సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి యాగశాలలో ఆయుష్య హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఏఈఓ, ఇన్‌చార్జి పీఆర్‌ఓ కృష్ణారావు, సూపరింటెండెంట్ రమణ పాల్గొన్నారు. సత్యదేవుని సుమారు 25 వేల మంది భక్తులు దర్శించారు. వ్రతాలు 1,250 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.25 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు.

విద్యార్థీ.. విజయోస్తు



- నేటి నుంచి 'పది' పరీక్షలు
- ప్రతి మూడు పరీక్షలకు జంబ్లింగ్ ఇన్విజిలేషన్
- ఉమ్మడి 'తూర్పు'న 373 పరీక్ష కేంద్రాలు
- హాజరు కానున్న 77,183 మంది విద్యార్థులు
- పరిశీలకురాలిగా ఆర్‌జేడీ

రాయవరం: విద్యార్థి జీవితంలో కీలకంగా భావించే పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి పరీక్షలు మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యా శాఖ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. నిబంధనలను మరింత కఠినతరం చేశారు. మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడితే సెక్షన్–25 ప్రకారం చర్యలు తీసుకుంటారు. విద్యార్థులు సివిల్ డ్రెస్‌లోనే పరీక్షలకు హాజరు కావాలి. తప్పనిసరిగా సమయ పాలన పాటించాలని అధికారులు ఇప్పటికే సూచించారు. విద్యార్థుల సమస్యలు అధిగమించేందుకు జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. పరీక్షలు సక్రమంగా, సమర్థంగా నిర్వహించేందుకు పాఠశాల విద్యా శాఖ ఆర్‌జేడీ నాగమణిని కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిశీలకురాలిగా నియమించారు. ఆమె మూడు జిల్లాల్లో పర్యటించి, పరీక్షల తీరును పర్యవేక్షిస్తారు. గత ఏడాది ఉమ్మడి జిల్లా కేంద్రంగా పదో తరగతి పరీక్షలు నిర్వహించగా, ఈసారి నూతన జిల్లా విద్యాశాఖాధికారుల నేతృత్వంలో జరుపుతున్నారు.

మూడు జిల్లాల్లో..

పదో తరగతి పరీక్షలకు కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో మొత్తం 373 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మూడు జిల్లాలూ కలిపి మొత్తం 77,183 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. వీరిలో 69,236 మంది రెగ్యులర్‌గా, 7,797 మంది ప్రైవేటుగా రాస్తున్నారు. అలాగే ఓరియెంటల్ సాంస్క్రిట్ స్కూల్ సర్టిఫికెట్ (ఓఎస్ఎస్‌సీ) పరీక్షలు రెగ్యులర్‌గా 131, ప్రైవేటుగా 19 మంది రాస్తున్నారు. మూడు జిల్లాల నుంచి రెగ్యులర్, ప్రైవేట్, ఓఎస్ఎస్‌సీ విద్యార్థులతో కలిపి మొత్తం పరీక్షలు రాయనున్నారు.

ఎన్నో జాగ్రత్తలు

- పరీక్షలు జరిగే రోజుల్లో పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ఆయా కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో జెరాక్స్, ఇంటర్‌నెట్ సెంటర్లు తెరచి ఉంచరాదు.
- ఇన్విజిలేటర్లు తప్పనిసరిగా ఐడీ కార్డులు ధరించాలి.
- పరీక్ష కేంద్రాలకు ఇన్విజిలేటర్లు, వైద్య సిబ్బంది ఫోన్లు తీసుకు వెళ్లడానికి వీల్లేదు. ఎవరి వద్ద సెల్ ఫోన్ ఉన్నా సస్పెన్షన్‌తో పాటు క్రమశిక్షణ చర్యలు కూడా తీసుకుంటారు. సీఎస్, డీఓలు కూడా ఫోన్ ఉపయోగించడానికి వీల్లేదు.
- పరీక్ష కేంద్రాల్లోకి ప్రజాప్రతినిధులు, మీడియాకు అనుమతి ఉండదు.
- ప్రతి మూడు పరీక్షలకు ఇన్విజిలేటర్లను జంబ్లింగ్ చేయనున్నారు. ఒక కేంద్రానికి కేటాయించిన ఇన్విజిలేటర్లను మూడు రోజుల కంటే ఎక్కువ ఉంచరు. తర్వాత మరో కేంద్రానికి పంపుతారు.
- ఇన్విజిలేషన్ విధులకు ఎట్టి పరిస్థితుల్లోనూ సబ్జెక్టు టీచర్లను నియమించరు. పీఈటీలు, క్రాఫ్ట్, డ్రాయింగ్, మ్యూజిక్ టీచర్లతో పాటు ఎస్‌జీటీల సేవలను వినియోగించుకుంటారు.
- పాఠశాల విధులకు ఆటంకం కలగకుండా ఇన్విజిలేటర్ల నియామకం చేపడుతున్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలల టీచర్లను ఇన్విజిలేషన్ విధులకు నియమించరు.
- సెల్ఫ్ సెంటర్లుగా ఉన్న పరీక్ష కేంద్రాల్లో అదే పాఠశాలల నుంచి టీచర్లను సీఎస్, డీఓ, ఇన్విజిలేషన్ విధులకు నియమించరు.
- విద్యార్థుల నామినల్ రోల్స్, ఫొటో అటెండెన్స్ షీట్లలో ఉన్న అంశాలను సరిచూసుకున్న తరువాతే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించాలని స్పష్టం చేశారు.
- ప్రైవేటు పరీక్ష కేంద్రాల్లో కచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

హెల్ప్‌లైన్ నంబర్

కోనసీమ: 99087 66727

జిల్లాలో పదో తరగతి పరీక్షల వివరాలు

పరీక్ష కేంద్రాలు	111
సీసీ కెమెరాలు ఉన్నవి	2
రాయనున్న విద్యార్థులు	20,967
బాలురు	10,821
బాలికలు	10,146
చీఫ్ సూపరింటెండెంట్లు (సీఎస్)	111
డిపార్ట్‌మెంటల్ అధికారులు (డీఓ)	111
అసిస్టెంట్ డిపార్ట్‌మెంటల్ అధికారులు	10
ఇన్విజిలేటర్లు	1,092
ఫ్లయింగ్ స్క్వాడ్‌లు	6

మాల్‌ప్రాక్టీస్ చేస్తే కఠిన చర్యలు



ఎక్కడా ఎటువంటి మాల్‌ప్రాక్టీస్‌కూ అవకాశం లేకుండా, కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించాల్సిందిగా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అన్ని చర్యలూ చేపట్టాం. మాల్‌ప్రాక్టీస్ కేసులు గుర్తిస్తే కఠిన చర్యలు తప్పవు.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

ప్రశ్నపత్రాలకు సీరియల్ నంబర్



తొలిసారిగా ప్రశ్నపత్రాలకు సీరియల్ నంబర్ ఉంటుంది. పరీక్షకు హాజరు కాని వారి ప్రశ్నపత్రాలు పక్కన పెడతాం. విద్యార్థులు సమాధానాలు రాసేందుకు ఈ ఏడాది కొత్తగా 24 పేజీల బుక్‌లెట్ ఇస్తారు. అవసరమైతే అదనంగా 12 పేజీల బుక్‌లెట్ ఇస్తారు.

– ఎం.కమలకుమారి, జిల్లా విద్యాశాఖాధికారి, కోనసీమ

25 యాక్ట్ అమలుకు ఆదేశాలు

మరోవైపు 1997 యాక్ట్–25 అమలు చేస్తున్నారు. పరీక్ష కేంద్రంలోకి స్క్వాడ్‌లు వచ్చినప్పుడు విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతున్నట్టు గుర్తిస్తే దానికి ఇన్విజిలేటర్లే బాధ్యత వహించాల్సి ఉంటుంది. వారితో పాటు సీఎస్, డీఓలను కూడా బాధ్యులను చేస్తారు. బాధ్యులపై క్రిమినల్ కేసుల నమోదుతో పాటు ఆరు నెలల నుంచి మూడేళ్ల వరకూ జైలుశిక్ష, రూ.5 వేల నుంచి రూ.లక్ష వరకూ జరిమానా విధిస్తారు.

నేటి నుంచే ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 64 కేంద్రాలు
- హాజరు కానున్న 19,545 మంది విద్యార్థులు

రాయవరం: పదో తరగతి రెగ్యులర్ పరీక్షలతో పాటు, ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు కూడా సోమవారం ప్రారంభమవుతున్నాయి. మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఓపెన్ టెన్త్ పరీక్షలకు 19 కేంద్రాల్లో 5,428 మంది హాజరు కానున్నారు. అలాగే ఓపెన్ ఇంటర్ పరీక్షలు 45 కేంద్రాల్లో 14,117 మంది రాయనున్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఓపెన్ టెన్త్ 1,248, ఇంటర్‌కు 4,400 మంది హాజరు కానున్నారు. కాకినాడ జిల్లాలో ఓపెన్ 'పది' 2,088, ఇంటర్ పరీక్షలు 5,527 మంది రాయనున్నారు. తూర్పు గోదావరి జిల్లాలో ఓపెన్ టెన్త్‌కు 2,092 మంది, ఇంటర్‌కు 4,190 మంది హాజరు కానున్నారు. పరీక్షల నిర్వహణకు కాకినాడ జిల్లాలో 367, కోనసీమ జిల్లాలో 276, తూర్పు గోదావరి జిల్లాలో 301 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. అలాగే, మూడు జిల్లాల్లో 14 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. పరీక్షల్లో విద్యార్థులకు ఎటువంటి సమస్యలు తలెత్తినా పరిష్కారానికి 98480 32105 నంబర్‌తో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారు.

కళాకారులకు ఆహ్వానం

అన్నవరం: ఈ నెల 30 నుంచి మే ఆరో తేదీ వరకూ రత్నగిరిపై సత్యదేవుని వార్షిక దివ్యకల్యాణ మహోత్సవాలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కూచిపూడి, భరత నాట్యం, భక్తిగీతాలు, హరికథ, బుర్రకథ, తోలుబొమ్మలాట, జానపద కళారూపాలు, పౌరాణిక నాటికలు, నాటకాలు తదితర సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చేందుకు కళాకారుల నుంచి దేవస్థానం అధికారులు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఆసక్తి ఉన్న వారు 63010 92359 నంబర్‌లో ఫోన్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

సెంచరీలు కొట్టే వయస్సు మాది..



ఒకే వేదికపై కలుసుకున్న పూర్వ విద్యార్థులు

- 50 ఏళ్లకు కలుసుకున్న పూర్వ విద్యార్థులు
- ఉత్సాహంగా గడిపిన పాతతరం కుర్రాళ్లు

అమలాపురం టౌన్: సెంచరీలు కొట్టే వయస్సు మాది అంటూ... పాతతరం కుర్రోళ్లు సందడి చేశారు. యాభై ఏళ్ల కిందట ఒకే చదువులమ్మ కోవెలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరారు. చదువయ్యాక ఉన్నత ఉద్యోగులు చేసి ఉద్యోగ విరమణ పొంది నేడు విశ్రాంతి తీసుకుంటున్న వారు ఇన్నేళ్ల తర్వాత కలిశారు. అలనాటి జ్ఞాపకాలను నెమర వేసుకున్నారు. అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో 1970–75లో ఇంటర్, డిగ్రీ చదివిన 33 మంది పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. దీనికి స్థానిక శ్రీకళా గ్రాండ్ రెసిడెన్సీ వేదికైంది. పూర్వ విద్యార్థులంతా 70 ఏళ్ల నుంచి 80 ఏళ్ల వయస్సు వారైనప్పటికీ నాటి విద్యార్థుల్లా ఉత్సాహంగా గడిపారు. వేడుక వద్ద నాడు కళాశాలలో చదువులు పూర్తయ్యాక ఎవరికి వారు విడిపోతున్నప్పుడు తీసుకున్న అలనాటి బ్లాక్ అండ్ వైట్ గ్రూపు ఫోటోను భారీ ఫెక్సీగా ఏర్పాటు చేశారు. అందులో నాడు విద్యార్థిగా ఉన్న ఫోటోలను చూసుకుని ఈ విశ్రాంత ఉద్యోగులు తెగ మురిసిపోయారు. నాడు తమకు పాఠాలు చెప్పిన గురువులు మంథా సాంబశివ శాస్త్రి, పీవీ సత్యనారాయణ మూర్తి, సీవీ సర్వేశ్వరశర్మ, కొల్లూరి సుబ్బారావు, కె.విశ్వనాథశాస్త్రిలను ఘనంగా సత్కరించి పాదాభివందనం చేశారు. పూర్వ విద్యార్థుల్లో విశ్రాంత ప్రిన్సిపాల్స్, ప్రొఫెసర్లు, అధ్యాపకులు ఉన్నారు. విశ్రాంత ఉన్నతాధికారులు నిట్టల రవీంద్ర మూర్తి, బులుసు సత్యనారాయణమూర్తి, జి.చక్రధర రావు, కేవీఎస్ఎస్ రాజు, బీకే జనార్దనరావు, ఎస్.ఉమామహేశ్వరశాస్త్రి, వీబీ కృష్ణమూర్తి, టి.రాజేశ్వరి, ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరి తదితరులు ఈ వేడుకలను నిర్వహించారు.

భారం తీరింది..

- సత్ఫలితాలిచ్చిన వడ్డీ మాఫీ విధానం
- చాలావరకూ పన్ను బకాయిల వసూలు
- సద్వినియోగం చేసుకున్న యజమానులు



అమలాపురం పట్టణం

అమలాపురం టౌన్: ప్రభుత్వం ఇచ్చిన సదవకాశాన్ని పన్ను బకాయిదారులు సద్వినియోగం చేసుకున్నారు. పట్టణాల్లో బకాయి పన్నులను గత ఆర్థిక సంవత్సరాంతం అంటే మార్చి 31 నాటికి పూర్తిగా చెల్లిస్తే ఆ మొత్తంపై వడ్డీని మాఫీ చేస్తానని ప్రభుత్వం ప్రకటించింది. ఈ అవకాశాన్ని జిల్లాలో చాలావరకు వినియోగించుకున్నారు. ఈ గడువు గత శుక్రవారంతో ముగిసింది. జిల్లాలోని అమలాపురం, రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలు, ముమ్మిడివరం నగర పంచాయతీల్లో పన్నుల చెల్లింపుదారులు చాలా వరకూ ముందుకు రావడంతో బకాయి పన్నుల భారం కొంత దించుకున్నట్లయింది.

అమలాపురం మున్సిపాలిటీలో వడ్డీ మాఫీని ఎక్కువ మంది ఉపయోగించుకున్నారు. ఇక్కడ 95.80 శాతం మేర పన్నులు వసూలు చేసి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారు. తర్వాత స్థానంలో 90.60 శాతంతో ముమ్మిడివరం నగర పంచాయతీ నిలిచింది. రామచంద్రపురం మున్సిపాలిటీ 85 శాతం, మండపేట మున్సిపాలిటీ 82.80 శాతం మాత్రమే వసూలు చేయగలిగింది. ఈ మూడు మున్సిపాలిటీలు, ఒక నగర పంచాయతీలో 2021–22 సంవత్సరం డిమాండ్లకు అనుగుణంగా నిర్దేశించిన వసూళ్లతో పోల్చితే 2022–23 సంవత్సరానికి ఇచ్చిన వడ్డీమాఫీతో పన్నుల వసూళ్ల స్థాయి చాలావరకూ పెరిగింది. అమలాపురం మున్సిపాలిటీకి 13.26 శాతం, రామచంద్రపురానికి 44.50 శాతం, మండపేటకు 11.80 శాతం, ముమ్మిడివరానికి 40 శాతం మేర వసూళ్ల సామర్థ్యం పెరిగింది.

వడ్డీమాఫీ గడువు ముగిసిన (మార్చి 31) నాటికి పన్నుల వసూళ్లు ఇలా..

పేరు	డిమాండ్ (రూ.కోట్లు)	వసూలు (రూ.కోట్లు)	వసూళ్ల శాతం
అమలాపురం	7.42	7.11	95.80
రామచంద్రపురం	4.87	4.14	85.00
మండపేట	6.11	5.06	82.80
ముమ్మిడివరం	1.21	1.10	90.60

అందరి సహకారంతో లక్ష్యానికి చేరువ



పట్టణాల్లో బకాయి పన్నుల భారాన్ని తీర్చుకునేందుకు ప్రభుత్వం ఇచ్చిన వడ్డీమాఫీకి అనేకమంది బకాయిదారులు స్పందించారు. ఇదే స్ఫూర్తితో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా పన్నులను సకాలంలో చెల్లించి మున్సిపాలిటీల ప్రగతికి సహకరించాలి. అమలాపురం మున్సిపాలిటీలో 13,896 మంది భవన యజమానుల్లో వడ్డీ మాఫీని 95.80 శాతం మంది సద్వినియోగం చేసుకున్నారు. అందరి సహకారంతో లక్ష్యానికి దగ్గరగా చేరుకున్నాం.

–శిరిగినీడి శివాజీ, రెవెన్యూ అధికారి, అమలాపురం మున్సిపాలిటీ

ఆట.. అభివృద్ధి బాట

- జిల్లాలో మెరుగుపడిన వసతులు
- బాలయోగి స్టేడియానికి కొత్తరూపు
- రూ.50 లక్షలతో సెంట్రల్ ఏసీ జిమ్
- కొత్తగా క్రీడాశిక్షకుల నియామకం

సాక్షి, అమలాపురం: కలను నిజం చేసిన మార్పు అది.. కళ్ల ముందు ఆవిష్కరించిన అభివృద్ధి ఇది.. కొత్త జిల్లా ఏర్పడిన తర్వాత క్రీడాభివృద్ధిపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టింది. దీనిలో భాగంగా జిల్లా కేంద్రమైన అమలాపురంలో జీఎంసీ బాలయోగి స్టేడియం ప్రగతికి శ్రీకారం చుట్టింది. క్రీడా మైదానాల అభివృద్ధి, అత్యాధునిక జిమ్ ఏర్పాటుతో పాటు కొత్తగా క్రీడా శిక్షకులను నియమించింది. ప్లే అండ్ పే పద్ధతిలో ఒకవైపు జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దడంతో పాటు మరోవైపు స్టేడియం నిర్వహణకు అవసరమైన సదుపాయాలను సొంతంగా సమకూర్చుతోంది.

దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి పేరుపై అమలాపురంలో నిర్మించిన స్టేడియం టీడీపీ పాలకుల హయాంలో ఆదరణకు నోచుకోలేదు. నిలకడగా ఒక్క కోచ్ కూడా ఉండేవారు కాదు. ఇక్కడ జరిగే పనులు నాటి పాలకులకు అక్షయపాత్రగా ఉండేవి. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రావడం, కొత్తగా జిల్లా ఏర్పడటంతో స్టేడియానికి సరికొత్త హంగులు వస్తున్నాయి. ఇక్కడ గతంలోనే ఇండోర్ షటిల్ బ్యాడ్మింటన్ కోర్టును ఆధునీకరించారు. రెండు సింథటిక్ మ్యాట్‌లు వేసిన కోర్టులు అందుబాటులో ఉన్నాయి. తాజాగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చొరవ తీసుకుని రూ.10 లక్షల నిధులు కేటాయించారు. వీటితో బీటలు వారి దెబ్బతిన్న బాస్కెట్‌బాల్ కోర్టుకు మరమ్మతులు చేసి రంగులు వేసి తీర్చిదిద్దారు. నెట్స్‌లో శిక్షణ ఇచ్చేందుకు వీలుగా క్రికెట్ నెట్‌లను సిద్ధం చేశారు. అలాగే రెజ్లింగ్, తైక్వాండో మ్యాట్‌లను ఆయా క్రీడలకు సిద్ధం చేస్తున్నారు. వీటితో పాటు దెబ్బతిన్న ఇండోర్ స్టేడియంలో మౌలిక సదుపాయాలు కల్పించడం, రంగులు వేయడం, విద్యుదీకరణ పనులు పూర్తి చేసి స్టేడియాన్ని పోటీలకు సిద్ధం చేశారు.



అమలాపురం బాలయోగి స్టేడియంలో మరమ్మతులు చేసిన బాస్కెట్‌బాల్ కోర్టు

చూడముచ్చటగా జిమ్

స్టేడియంలో జిమ్ అధ్వానంగా మారడంతో కలెక్టర్ హిమాన్షు శుక్లా సీఎస్ఆర్ నిధులు రూ.50 లక్షలు కేటాయించారు. స్టార్ హోటల్స్, హైదరాబాద్, విశాఖపట్నం వంటి నగరాల్లో ఉండే వసతులతో ఈ జిమ్‌ను అధునాతనంగా తీర్చిదిద్దారు. సెంట్రల్ ఏసీ జిమ్ చూసేందుకు చూడముచ్చటగా ఉంది. ఇక్కడ అంతర్జాతీయంగా వస్తున్న కొత్త సామగ్రిని ఏర్పాటు చేశారు. జిమ్‌లో రబ్బర్ టైల్స్ వాడడంతో పాటు ఇంటీరియర్ చూడముచ్చటగా ఉంది.



క్రికెట్ శిక్షణకు వీలుగా నెట్స్ ఏర్పాటు పనులు

పే అండ్ ప్లే పద్ధతిలో..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా సాధికార సమితి (శాప్) సూచనల మేరకు ప్లే అండ్ పే పద్ధతిని అవలంబిస్తున్నారు. ఈ విధానంలో స్టేడియంలోని జిమ్, క్రీడా మైదానాలు వినియోగించుకునే వారికి.. శిక్షణ ఇచ్చే క్రీడా అసోసియేషన్ల నుంచి రుసుం వసూలు చేస్తారు. దీనిని శాప్‌కు పంపించడం, అక్కడి నుంచి వారు శిక్షకుల జీతాలు ఇవ్వడంతో పాటు క్రీడా మైదానాలు, సామగ్రిని సమకూరుస్తున్నారు. జిమ్, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్, స్కేటింగ్ వంటి క్రీడలకు మాత్రమే పే అండ్ ప్లేలో ఆదరణ లభిస్తోంది.




బాలయోగి స్టేడియంలో అధునాతన సెంట్రల్ ఏసీ జిమ్

ఆరుగురు శిక్షకులు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒక కోచ్ ఉండేవారు. ఇప్పుడు ఆరుగురు శిక్షకులు సేవలందిస్తున్నారు. చీఫ్ కోచ్ పీఎస్ సురేష్‌కుమార్‌తో పాటు బాస్కెట్‌బాల్, రెజ్లింగ్, తైక్వాండో, స్కేటింగ్, ఫిజికల్ ఫిట్‌నెస్ కోచ్‌లు ఉన్నారు. వివిధ రకాల క్రీడలకు శిక్షకులు ఉన్నందున ఈ ఏడాది సమ్మర్ క్యాంప్‌లో క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొంటారని జిల్లా క్రీడాధికారులు అంచనా వేస్తున్నారు. బాలయోగి స్టేడియంలోనే కాకుండా అమలాపురంలో రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు వీలుగా బాలుర ఉన్నత పాఠశాలలో బాస్కెట్‌బాల్ కోర్టులు నిర్మించారు. సీఎస్ఆర్ నిధులతో పాటు ఎంపీ చింతా అనురాధ ఎంపీ ల్యాడ్స్ నిధులతో జిల్లాలో పలు పాఠశాలల్లో కోర్టుల నిర్మాణం, క్రీడా సామగ్రి పంపిణీకి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అమలాపురం దుడ్డివారి అగ్రహారంలో ఇండోర్ షటిల్ బ్యాడ్మింటన్ సిమెంట్ కోర్టును ఉడెన్ హావాయ్ కోర్టుగా మార్పు చేశారు.

మరిన్ని వసతుల కల్పన



జిల్లాలో క్రీడాభివృద్ధికి శాప్‌తో పాటు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సహాయ సహకారాలు అందిస్తున్నారు. బాలయోగి స్టేడియంతో పాటు శాప్ ద్వారా అందే ప్రయోజనాలను క్రీడా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలి. అప్పుడే మెరుగైన క్రీడాకారులు స్థానికంగా తయారవుతున్నారు. పే అండ్ ప్లే పద్ధతిలో మరిన్ని క్రీడల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

–పీఎస్ సురేష్‌కుమార్, జిల్లా చీఫ్ కోచ్

కొబ్బరి.. సస్యరక్షణ తప్పనిసరి

- పంటకు ఆకుమచ్చ, ఆకు ఎండు తెగుళ్లు
- నివారణకు సమగ్ర యాజమాన్యం అవసరం

అంబాజీపేట: మండు వేసవిలోనూ చల్లదనాన్ని ఇచ్చేవి కొబ్బరి బొండాలు.. ఈ కాలంలో వీటికి ఎనలేని గిరాకీ ఉంటోంది.. ప్రస్తుతం ఈ తోటలు తెగుళ్ల బారిన పడుతున్నాయి.. ఆశించిన స్థాయిలో దిగుబడులు రాక రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో కొబ్బరిని సుమారు లక్ష హెక్టార్లలో సాగు చేస్తున్నారు. ఈ విస్తీర్ణంలో చాలా భాగం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోనే ఉంది. ప్రస్తుత వాతావరణంలో తెగుళ్ల కారణంగా కొబ్బరి దిగుబడి గణనీయంగా తగ్గింది. కొబ్బరి తోటల్లో తెగుళ్లను అరికట్టాలంటే సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ బి.శ్రీనివాసులు, శాస్త్రవేత్త డాక్టర్ గోవర్ధన్ చెబుతున్నారు.

ఒక చెట్టు నుంచి మరో చెట్టుకు..

లాసియోడిప్లోడియా థియోబ్రోమో అనే శిలీంద్రం ఆకుమచ్చ తెగులును కలుగజేస్తుంది. ఈ తెగులు శిలీంద్ర బీజాల ద్వారా గాలిలో ఒక చెట్టు నుంచి మరో చెట్టుకు వ్యాపిస్తుంది. రాత్రి వాతావరణ ఉష్ణోగ్రతలు 28 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉండి, మంచు పడే వాతావరణంలో శిలీంద్ర బీజాలు ఆకులపై మొలకెత్తి పత్ర రంధ్రాల ద్వారా లోపలకు ప్రవేశిస్తాయి. కొబ్బరితో పాటు, ఆయిల్‌పామ్, వక్క, అలంకరణ మొక్కలు, పామ్ జాతి మొక్కలకు ఈ తెగులు వ్యాపిస్తుంది. తెగులు సోకిన ఆకులు ఎండిన తరువాత, కింద పడిన భాగాలు ప్రతికూల పరిస్థితులలో దాగి ఉండి, తిరిగి అనుకూల పరిస్థితులలో గాలి ద్వారా శిలీంద్ర బీజాలు వ్యాప్తి జరుపుతాయి. సంకర, పొట్టి, లేత మొక్కలలో ఈ తెగులు ఎక్కువగా కనిపిస్తుంది. దీనివల్ల నష్ట తీవ్రత 25 శాతం వరకూ ఉంటుంది. సర్పిలాకార తెల్లదోమ సోకడంతో పొటాష్, ఇతర పోషక లోపాల కారణంగా ఒత్తిడులకు గురైన మొక్కలపై ఈ తెగులు ఎక్కువగా వ్యాపిస్తుంది. వేసవిలో ఉధృతి అధికంగా ఉంటుంది.



వాడిపోతున్న కొబ్బరి చెట్టు



తెగుళ్లు ఆశించిన కొబ్బరి కాయలు

ఆకు ఎండు తెగులు లక్షణాలు

ఆకు ఎండు తెగులు బాహ్య వలయంలోని ఆకు రెమ్మలపై చిన్న పాడ మచ్చలుగా ఏర్పడి, క్రమేపి లోపల వలయంలోని ఆకులకు విస్తరిస్తుంది. తెగులు సోకిన బాహ్యవలయంలో ఆకు రెమ్మలు చివరి నుంచి ఎండిపోవడం ప్రారంభమై, క్రమేపి మొత్తం ఆకు ఎండిపోతుంది. కొబ్బరి ఆకు నుంచి మధ్య ఈనెకు వ్యాపించిన తరువాత మట్టపై గోధుమరంగు, పాగ చూరిన మచ్చలు ఏర్పడతాయి. కొబ్బరి కాయలపై గోధుమ రంగు పాడ మచ్చలు వచ్చి, ముచ్చిక చివరిభాగం నుంచి లోపలకు వ్యాపించడంతో కుళ్లి రాలిపోతాయి. మట్ట ద్వారా పెరుగుదల భాగానికి ఆశించి, చెట్టు చనిపోతుంది.

నివారణ చర్యలు ఇవీ..

ఈ రెండు తెగుళ్లు సోకిన ఆకులను చెట్టు నుంచి వేరు చేసి కాల్చివేయాలి. ఆ తోటలలో ప్రతి సంవత్సరం చెట్లకు 200 గ్రాముల సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్‌టాల్క్ పొడిని, 50 కిలోల పశువుల ఎరువు మరియు 5 కిలోల వేపపిండిలో కలిపి

పాడి-పంట

వేసి, తగినంత నీరు అందించాలి. తేమ నిల్వ ఉండడానికి మల్చింగ్ చేపట్టాలి. 2 మి.లీ. హెక్సాకొనజోల్ 100 మి.లీ. నీటిలో కలిపి 3 నెలలకు ఒకసారి వేరు ద్వారా దఫాలుగా ఎక్కించాలి. లేత తోటలలో ఈ తెగులు ఆశిస్తే, రెండు మి.లీ. హెక్సాకొనజోల్ లేదా ప్రొపికొనజోల్ ఒక లీటరు నీటికి కలిపి, ఆకులు మొత్తం తడిచేలా 45 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్‌టాల్క్ పొడిని, బోర్డో మిశ్రమంతో కానీ లేదా ఇతర తెగులు మందులతో కలిపి వాడకూడదు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



తగిన సమయంలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి. కొబ్బరి తోటలకు ఆకుమచ్చ, ఆకు ఎండు తెగుళ్లు విపరీత నష్టాన్ని కలిగిస్తాయి. సిఫార్సు చేసిన మోతాదులో పొటాష్ ఎరువులు క్రమం తప్పకుండా వేస్తే మొక్కలలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. తద్వారా దిగుబడులపై ప్రభావం ఉండదు.

–డాక్టర్ బి.శ్రీనివాసులు, అధిపతి, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం, అంబాజీపేట

ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ అవసరం



కుంగ్ ఫూ చాంపియన్‌షిప్ ట్రోఫీని అందజేస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆత్మరక్షణకు ప్రతి ఒక్కరూ కరాటే, కుంగ్ ఫూ వంటి మార్షల్ ఆర్ట్స్‌ను నేర్చుకోవాలని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ తెలిపారు. ఆదివారం స్థానిక రైల్వే స్టేషన్ వద్ద మున్సిపల్ కల్యాణ మండపంలో ఫస్ట్ ఏపీ స్టేట్ కుంగ్ ఫూ చాంపియన్ షిప్– 2023 పోటీలు నిర్వహించారు. దీనికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. బాల బాలికల విభాగ పోటీలకు రాష్ట్రం నలుమూలల నుంచి మొత్తం 126 మంది హాజరయ్యారు. మహిళా విభాగంలో చాంపియన్‌షిప్‌ను రాజమహేంద్రవరం కైవసం చేసుకోగా, పురుషుల విభాగంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా జొన్నాడ చాంపియన్‌గా నిలిచింది. విజేతలకు ఎంపీ భరత్‌రామ్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుంగ్ ఫూలో జాతీయ స్థాయిలో రాణించాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. ముఖ్యంగా బాలికలు విద్యతో పాటు ఆత్మరక్షణకు అవసరమైన విద్యను సాధన చేయాలన్నారు. మన చేతిలో కుంగ్ ఫూ లాంటి విద్య ఉందంటే సమాజంలో ఎటువంటి క్లిష్ట పరిస్థితులనైనా ధైర్యంగా ఎదుర్కోవచ్చని చెప్పారు. నిర్వాహకులు, కోచ్‌లను అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రత్నగిరికి మళ్లీ ఆటోల బంద్



దేవస్థానం కళాశాల మైదానంలో నిలిచిపోయిన ఆటోలు

అన్నవరం: రత్నగిరిపైకి వెళ్లే ఆటోల సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. ఆటోలో బేబీ సీటు (సీటు ముందు పొడవుగా ఉండే బల్ల)ను తొలగిస్తే తప్ప రత్నగిరికి అనుమతించబోమని దేవస్థానం అధికారులు తెలపడంతో నాలుగు రోజులుగా రెండు వందలకు పైగా డ్రైవర్లు తమ ఆటోలను కొండ దిగువనే నిలిపివేశారు. దీంతో భక్తులూ ఇబ్బంది పడుతున్నారు. రైల్వే స్టేషన్, బస్టాండ్ నుంచి రత్నగిరికి దేవస్థానం బస్సులు నడుపుతున్నా శని, ఆదివారాలు, తదితర రద్దీ రోజుల్లో పూర్తి స్థాయిలో సేవలందించలేకపోతున్నారు. దీంతో భక్తులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. వివిధ కారణాలతో గత నెలలో 20 రోజుల పాటు ఆటోలను రత్నగిరి పైకి అనుమతించని విషయం తెలిసిందే. డ్రైవర్లు ఈ విషయాన్ని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్‌కు తెలపగా ఆయన రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లడంతో కొన్ని షరతులతో ఆటోలను తిరిగి రత్నగిరికి అనుమతించారు. ఆటోకు ముగ్గురిని మాత్రమే అనుమతిస్తామని, డ్రైవర్లు విధిగా నుదిటిన తిలకం ధరించాలని, అన్యమత చిహ్నాలు, గీతాలు ఆటోలపై ఉండరాదని, భక్తుల పట్ల దురుసుగా ప్రవర్తించరాదని అధికారులు నిబంధనలు విధించారు. ఈ నిబంధనలకు డ్రైవర్లు అంగీకరించడంతో గత నెల 28 నుంచి రత్నగిరి పైకి ఆటోలను అనుమతించారు. గత నెల 29న ఆటోలో ముందు ఉన్న బేబీ సీటును తొలగిస్తే తప్ప ఆటోలను అనుమతించేది లేదని అధికారులు చెప్పడంతో డ్రైవర్లు నిరసన వ్యక్తం చేసి తమ ఆటోలను నిలిపివేశారు. ముగ్గురి కన్నా ఎక్కువ మందిని ఎక్కించుకుంటే ఆటోలను ఆపేయాలే తప్ప సీట్లు తీసేయమనడం సబబు కాదని డ్రైవర్ల వాదన. ఆటోలకు బేబీ సీటు ఎప్పటి నుంచో ఉందని, ఇప్పుడు తీసేయమనడం సరికాదని అంటున్నారు.

ఈఓ సానుకూలంగా స్పందించారు

ఆటోలో బేబీ సీటు తీసేయడంతో వచ్చే ఇబ్బందులను ఆలయ ఈఓ చంద్రశేఖర్ అజాద్‌కు ఆదివారం తెలియజేశామని అన్నవరం సర్పంచ్ కుమార్‌రాజా చెప్పారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. లిఖిత పూర్వకంగా రాసివ్వాలని చెప్పడంతో ఆ మేరకు ఇచ్చామన్నారు. దీనిపై ఆయన నిర్ణయం కోసం వేచి చూస్తున్నామని సర్పంచ్ అన్నారు.

పట్టా పండగకు పచ్చజెండా

- జేఎన్‌టీయూకే స్నాతకోత్సవానికి గవర్నర్ ఆమోదం
- మే 31న నిర్వహణకు ఏర్పాట్లు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ తొమ్మిదో స్నాతకోత్సవానికి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. దీని నిర్వహణకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆమోదం తెలిపారు. ఈ వేడుకలకు వర్సిటీ కులపతి హోదాలో రావాలని గవర్నర్‌ను అధికారులు ఆహ్వానించగా మే 31న నిర్వహణకు తేదీ ఖరారు చేశారు. దీంతో విద్యాభ్యాసం పూర్తి చేసిన విద్యార్థులు అతిరథ మహారథుల చేతుల మీదుగా పట్టా (ఒరిజినల్ డిగ్రీ) అందుకోనున్నారు. విద్యార్థుల ఒరిజినల్ డిగ్రీ కోసం గత ఏడాది డిసెంబర్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానించారు. 9వ స్నాతకోత్సవంలో భాగంగా బీటెక్ విభాగంలో 40 వేల ఓడీలతో పాటు ఫార్మసీ, పీజీ విభాగాలలో మరో 15 వేల వరకూ ఓడీలు విద్యార్థులు పొందనున్నారు. ప్రతి ఏడాది క్రమం తప్పకుండా వర్సిటీ నిర్వహించాల్సిన వేడుకలు కోవిడ్‌నేపథ్యంలో 2020, 2021లో నిర్వహించలేదు. వర్సిటీ ఏడో స్నాతకోత్సవ వేడుకలు గత 2019 ఆగస్టు 17న నిర్వహించగా అప్పుడు కులపతి హోదాలో రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ హాజరయ్యారు. 8వ స్నాతకోత్సవాన్ని ప్రస్తుత వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు వీసీగా బాధ్యతలు స్వీకరించిన ఐదు నెలలలో అంటే గత ఏడాది మార్చిలో నిర్వహించారు. ప్రస్తుతం 9వ స్నాతకోత్సవానికి సన్నద్ధమవుతున్నారు.



కాకినాడ జేఎన్‌టీయూ

ఏటా క్రమం తప్పకుండా..



పట్టభద్రుల వేడుకలు అనేవి క్రమం తప్పకుండా ప్రతి ఏడాది నిర్వహించాలనే ఉద్దేశంతో ప్రణాళిక ప్రకారం దరఖాస్తులు స్వీకరించాం. కులపతి హోదాలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ రావడానికి అనుమతి ఇచ్చారు. ఈ వేడుకల్లో 2020–21, 2021–22 విద్యా సంవత్సర విద్యార్థులకు పట్టాలు అందజేస్తాం. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి, ఉన్నత విద్యా మండలి చైర్మన్‌తో పాటు మాజీ వీసీలకు ఆహ్వానం పంపిస్తున్నాం.

–డాక్టర్ జీవీఆర్ ప్రసాద్‌రాజు, వీసీ, జేఎన్‌టీయూకే

నిను చూడగ.. మది మురవగ



గరుడ వాహనంపై స్వామివారిని ఊరేగిస్తున్న పండితులు, అధికారులు



అలరించిన చిన్నారుల నృత్యం

- వాడపల్లి వెంకన్నకు ప్రత్యేక పూజలు
- గరుడ వాహనంపై స్వామివారి ఊరేగింపు

ఆత్రేయపురం: ఆ కోనేటి రాయుడిని చూసిన భక్తజనం మురిసిపోయింది.. స్వామివారికి పూజలు చేసి తరించింది.. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారిని అశేష సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వేకువ జామునే స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవచనం తదితర పూజలను రమణీయంగా చేశారు. అనంతరం వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి కల్యాణోత్సవాలను వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం వేదపండితుడు ఖండవల్లి వర ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు మంత్రోచ్చరణల నడుమ నిర్వహిస్తున్నారు. ఉదయం 8 గంటలకు స్వస్తి వచనం, కల్యాణోత్సవ ప్రదాన హోమాలు, ద్విగ్దేవతా బలిహరణ, శాంతిహోమం, విశేషార్చన, నీరాజన మంత్రపుష్పం, సాయంత్రం 6 గంటలకు సంకల్పం, ప్రధాన హోమాలు శాస్త్రోక్తంగా జరిపారు. స్వామివారికి బాణసంచా కాల్పులు, వాయిద్యాలతో పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారిని గరుడ వాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణ మార్మోగింది. అనంతరం ఆలయ ప్రాంగణంలో చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన రంజింపజేసింది. అలాగే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి పొన్న వాహనంపై గ్రామోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.



స్వామివారికి శాంతి హోమం నిర్వహిస్తున్న పండితులు

జోడెడ్ల బండి.. సై అంటూ వచ్చింది

పెద్దిపాలెంలో రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు

ప్రత్తిపాడు రూరల్: జోడెడ్లు.. సై సై అంటూ కదిలాయి.. నువ్వా నేనా అంటూ పరుగెత్తాయి.. ప్రతిపాడు రూరల్ మండలం పెద్దిపాలెంలో నూకాలమ్మ తల్లి జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పందేలు రసవత్తరంగా సాగాయి. స్థానిక ఏలేరు కాలువ గట్టు మార్గంలో జరిగిన ఈ పోటీలను ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ ప్రారంభించారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో వివిధ జిల్లాలకు చెందిన 40 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. యజమానులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టేందుకు ఎడ్లు హుషారుగా పరుగెత్తాయి. ఈ పోటీలు చూపరులను ఆకట్టుకున్నాయి. సీనియర్ విభాగంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరుకు చెందిన కోరా శృతిచౌదరి ఎడ్లు ప్రథమ, పెద్దిపాలేనికి చెందిన నలమాటి రాజు ఎడుల్ ద్వితీయ, గుమ్మిలేరుకు చెందిన కోరా శృతిచౌదరి ఎడ్లు తృతీయ బహుమతులు దక్కించుకున్నాయి. జూనియర్స్ విభాగంలో కొవ్వాడ గ్రామానికి చెందిన మట్ట బసవయ్య ఎడ్లు ప్రథమ, గుమ్మిలేరుకు చెందిన కోరా శృతిచౌదరి ఎడ్లు ద్వితీయ, వెల్దుర్తికి చెందిన మొగలి ఏసుబాబు ఎడ్లు తృతీయ, వడిసిలేరు గ్రామానికి చెందిన లక్ష్మీగణపతి ఎడ్లు నాలుగో బహుమతి దక్కించుకున్నాయి. విజేతలకు నిర్వాహకులు నగదు, షీల్డ్‌లను ప్రదానం చేశారు. ప్రత్తిపాడు సీఐ కె.కిశోర్‌బాబు, ఎస్సై ఎం.పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఈ పోటీలను తిలకించేందుకు భారీ ఎత్తున జనం తరలివచ్చారు. న్యాయ నిర్ణేతలుగా సిద్ధ నానాజీ, చేకూరి రామకృష్ణ, యనమల కృష్ణ వ్యవహరించారు. ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, అన్నవరం ట్రస్టు బోర్డు సభ్యుడు దోశీ చిట్టిబాబు, సొసైటీ చైర్మన్ గొంతిన సురేష్, సర్పంచ్ దేవర మానస రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పోటీలో పరుగెడుతున్న ఎడ్లు



ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

యువికా.. చక్కని వేదిక

- తొమ్మిదో తరగతి విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు
- రిజిస్ట్రేషన్‌కు నేటితో గడువు పూర్తి

రాయవరం: అంతరిక్ష విజ్ఞానం, స్పేస్ అప్లికేషన్స్‌పై ప్రాథమిక పరిజ్ఞానం కల్పించేందుకు యువికా–2023 (యంగ్ సైంటిస్ట్) కార్యక్రమాన్ని భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) రూపొందించింది. శిక్షణ ఇచ్చి యువ శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు తొమ్మిదో తరగతి విద్యార్థులకు అవకాశం కల్పించింది. యువ విజ్ఞాన కార్యక్రమం (యువికా) పేరుతో ఈ శిక్షణ ఇవ్వనున్నారు.

దరఖాస్తు చేసుకోవాలిలా..

2022–23 విద్యా సంవత్సరంలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు. హెచ్‌టీటీపీఎస్//డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐఎస్‌ఆర్‌వో.జీవోవీ.ఇన్ లేదా యువికా.హెచ్‌టీఎంఎల్ ద్వారా నాలుగు దశల్లో విద్యార్థులు దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. మొదట ఈ–మెయిల్ ఐడీతో వివరాలు నమోదు చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకున్న 48 గంటల వ్యవధిలో ఇస్రో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాలి. క్విజ్ పూర్తి చేసిన 60 నిమిషాల తర్వాత యువికా పోర్టల్‌లో ఆన్‌లైన్ దరఖాస్తుతో పూర్తి వివరాలు సమర్పించాలి. గత మూడేళ్లలో వివిధ అంశాల్లో సాధించిన ప్రగతికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు ఏవైనా ఉంటే, వాటి జిరాక్స్ కాపీలపై విద్యార్థి సంతకం చేసి అప్‌లోడ్ చేయాలి. ఎంపిక జాబితాను రెండు విడతల్లో ప్రకటించి అర్హత సాధించిన వారికి సమాచారం అందిస్తారు. ఎంపికైన వారు శిక్షణకు హాజరయ్యేందుకు రవాణా చార్జీలు, బస, భోజన వసతి సౌకర్యాలను ఇస్రో కల్పించనుంది.



యువికా బ్రోచర్

ఎంపిక పద్ధతి

8వ తరగతిలో పొందిన మార్కులకు 50 శాతం, గత మూడేళ్లలో పాఠశాల/జిల్లా/రాష్ట్ర/జాతీయ స్థాయిలో నిర్వహించిన ఏదైనా వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటే వరుసగా 2/5/10 శాతం, ఆన్‌లైన్ క్విజ్‌లో ప్రతిభకు 10 శాతం, ఒలింపియాడ్‌లో పాల్గొని పాఠశాల/జిల్లా/రాష్ట్ర స్థాయిల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా 2/4/5 శాతం, రిజిస్టర్డ్ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడలు, అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటిన వారికి 2/4/5 శాతం, గత మూడేళ్లలో స్కౌట్/ఎన్‌సీసీ/ఎన్ఎస్ఎస్‌లో ప్రతిభ చూపిన వారికి 5 శాతం, గ్రామీణ ప్రాంతంలో చదువుతున్న వారికి 15 శాతం మార్కులు ఇస్తారు. జాతీయ స్థాయిలో ఎంపికైన వారికి మే 15 నుంచి 26వ తేదీ వరకూ ఆయా కేంద్రాల్లో రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఇస్తారు. ఎంపికైన విద్యార్థితో పాటు తల్లిదండ్రుల్లో ఒకరు లేదా గైడ్ టీచర్‌కు కూడా ప్రయాణ ఖర్చులు చెల్లిస్తారు. శిక్షణ అనంతరం శ్రీహరికోట సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రానికి తీసుకెళ్లి అక్కడి విశేషాలను వివరిస్తారు.

ఏడు కేంద్రాల్లో శిక్షణ

విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఏడు కేంద్రాలను ఎంపిక చేశారు. తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయి స్పేస్ సెంటర్, బెంగళూరులోని యూఆర్ రావు శాటిలైట్ సెంటర్, అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్ సెంటర్, హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, షిల్లాంగ్‌లోని నార్త్ ఈస్ట్ స్పేస్ అప్లికేషన్ సెంటర్, ఐఐఆర్ఎస్, డెహ్రాడూన్, సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం, శ్రీహరికోటలో ఎంపికైన విద్యార్థులకు శిక్షణ ఇస్తారు.

ముఖ్యమైన తేదీలు

రిజిస్ట్రేషన్ తుది గడువు:	ఏప్రిల్ 3
మొదటి విడత జాబితా విడుదల:	ఏప్రిల్ 10
రెండో విడత జాబితా విడుదల:	ఏప్రిల్ 20
ఎంపికైనవారు రిపోర్టింగ్ చేయాల్సిన తేదీ:	మే 14
యువికా ప్రోగ్రామ్:	మే 15–26

నాలుగు కిలోల బంగారు ఆభరణాలు మాయం

- గుమస్తా కనిపించడం లేదని తాకట్టు వ్యాపారి ఫిర్యాదు
- రూ.కోటికిపైగా విలువ ఉంటుందని అంచనా

కొవ్వూరు: స్థానిక మెయిన్‌రోడ్డులోని శాంతిలాల్ జైన్ అనే బంగారం తాకట్టు వ్యాపారి వద్ద సుమారు నాలుగు కేజీల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ తెలిపారు. ఈ వ్యాపారి వద్ద గత ఎనిమిదేళ్ల నుంచి పనిచేస్తున్న శెట్టి రాము అనే వ్యక్తి ఉదయం నుంచి కనిపించడం లేదని ఫిర్యాదు చేశాడన్నారు. నమ్మకంతో పని చేస్తుండడంతో వ్యాపారి కూడా అతనికి ఆర్థిక లావాదేవీలు అప్పగించినట్లు చెబుతున్నారు. ఉదయం అకౌంట్స్ చూసే సమయంలో లాకర్స్‌లో బంగారం మాయం అయినట్లు గుర్తించారు. గుమస్తాగా పనిచేస్తున్న వ్యక్తి కనిపించకుండా పోవడంతో అతనిపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బంగారం విలువ రూ.కోటికి పైగా ఉంటుందని అంచనా. శాంతిలాల్ జైన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వర్మ తెలిపారు.

పెంపుడు కుక్కకు దినకర్మ పూజలు

కపిలేశ్వరపురం: అంగర గ్రామానికి చెందిన గుడిమెట్ల వీర్రాజు 14 ఏళ్లుగా ఓ కుక్కను పెంచుకుంటున్నాడు. సోని పేరుతో అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న ఆ కుక్క పది రోజుల కిందట చనిపోయింది. ఆ రోజు దానిని గౌతమీ గోదావరి నది వద్ద ఖననం చేశారు. 11వ రోజైన ఆదివారం దశ దినకర్మకాండ పూజలు చేశారు. బంధువులకు భోజనాలు పెట్టారు.